# పందికొక్కులు

దేశంలో పందికొక్కుల విజృంభణ నానాటికీ తీవ్రమైంది. మనిషి చెమటోడ్చి పండించిన ధాన్యంలో పదోవంతు పందికొక్కుల కమిషన్‌గా ఆమోదించబడుతూ వస్తున్నది. కాని యాభై శాతం పందికొక్కులు తినెయ్యటం చాలా తప్పు. అందుకని కొందరు యువకులు పందికొక్కులను వెతికి చంపసాగారు. పందికొక్కులను చంపటం హింస. వేద విరుద్ధం. అందుచేత ప్రభుత్వం పందికొక్కులను చంపేవాళ్లను వేటాడి తుపాకులతో కాల్చటమూ, పట్టుబడితే కారాగృహాలలో పెట్టి చిత్రహింసలు చేయటమూ సాగించింది.

అయిన "పందుకొక్కులు నశించాలి" అన్న నినాదం యిచ్చింది ప్రభుత్వం.

"ఇది కపట నినాదం. ఈ ప్రభుత్వం పందికొక్కులను తుపాకులతో కాపాడుతున్నది" అంటూ కొందరు రాజకీయవేత్తలు బయలుదేరి, అహింసా విధానంలో పాత ప్రభుత్వాన్ని పడగొట్టి కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేశారు.

వీళ్లు ప్రజలకు హామీ ఇచ్చారు!

"పందికొక్కుల్ని అదుపులో ఉంచుతాం. దేశంలో ఆహార ధాన్యాల కొరత తీరుస్తాం."

కాని పందికొక్కుల విజృంభణ తగ్గలేదు. హెచ్చింది. కొత్త ప్రభుత్వం ఏం చేస్తున్నదని ప్రజలు అడిగారు.

అలా అడగటం అన్యాయం. కొత్త ప్రభుత్వం చేతులు కట్టుకు కూర్చోలేదు. అది పందికొక్కులను అదుపులో ఉండమని వేడుకున్నది. న్యాయంగా పది శాతం భోంచేయమన్నది. అంతకుమించి తినటం అక్రమమనీ, అలా చేస్తే కఠిన చర్యలు తీసుకోబడతాయనీ అన్నది. ఆ చర్యలు ఎలాటివో అది పరమ రహస్యం.

పందికొక్కుల్ని అదుపులో పెట్టేదానికి పదేళ్ల వ్యవధి ఇయ్యమనీ, పోయిన ప్రభుత్వం పెంచిన పందికొక్కుల్ని అదుపు చెయ్యటం త్వరలో జరిగే పని కాదనీ, అయినా పందికొక్కులను వేటాడేవాళ్ల ప్రాణాలు తీసే అహింకా కార్యక్రమం అక్షరాలా సాగుతుందని కొత్త ప్రభుత్వం అటు ప్రజలకూ, ఇటు పందికొక్కులకూ కూడా హామీ ఇచ్చింది.

అందుచేత మళ్లీ అయిదేళ్లకు ప్రజలు ఈ ప్రభుత్వాన్నే ఎన్నుకుంటే పదేళ్ల తరువాత నందో రాజా భవిష్యతి.

***ముద్రణ : యువ, జనవరి 1978***